# 3

# క్రీస్తు, మన ప్రధాన యాజకుడు

## (4:14-16; 5:1-10; 7:1-28; 8:1, 2)

ప్రజలను దేవుని యొద్దకు తిరిగి తీసుకురావడమే దాదాపు ప్రతి మతం యొక్క విధి. ఇందుకోసమే, దాదాపు ప్రతి మతంలోనూ, ప్రజలను దేవుని యొద్దకు తీసుకువచ్చేందుకు, దైవమునకు ప్రజలకు మధ్య మధ్యవర్తివలె పనిచేసే ఒక ప్రధాన యాజకుడు లేదా దాని సమాన విధిగల వ్యక్తి ఉంటాడు. క్రైస్తవ్యంలోనూ అటువంటి ప్రధాన యాజకుడు, యేసు క్రీస్తు ఉన్నాడని హెబ్రీ పత్రిక తెలియజేస్తుంది!

నిజానికి, క్రీస్తు యొక్క ప్రధాన యాజకత్వము ఈ గ్రంథంలోని ప్రధాన ఉద్దేశం. సాధారణంగా, బైబిలులోని ఏదయినా గ్రంథమును చదువుతున్నప్పుడు, అది ఏం చెప్తుందాయని అర్థంకాని పరిస్థితులలో ఉంటాము. కానీ ఈ హెబ్రీ పత్రిక మాత్రం మనం అయోమయ స్థితిలోనుండ వీలులేదు. హెబ్రీయులకు 8:1లో గ్రంథకర్త యిలా తెలియజేస్తున్నాడు:

> మేము వివరించుచున్న సంగతులలోని సారాంశమేదనగా, మనకు అట్టి ప్రధాన యాజకుడు ఒకడున్నాడు, ... ఆయన పరలోకమందు మహామహుని సింహాసనమునకు కుడిపార్శ్వమున ఆసీనుడాయెను.

స్పష్టంగా చెప్పాలంటే, "నేను చెప్పదలచుకున్న ముఖ్య విషయమేమంటే, మనకు ఇటువంటి ప్రధాన యాజకుడున్నాడు" అని గ్రంథకర్త చెప్తున్నాడు. ఈ వచనం ద్వారా మనం స్పష్టంగా చెప్పదగ్గ విషయమేమంటే, ప్రజలు పడిపోకుండా బోధించడం దీని ఉద్దేశం కాగా క్రీస్తుని ప్రధాన యాజకత్వం ప్రధాన విషయం.[1]

గ్రంథం ఏమి చెప్తుందో మనం గ్రహించాలి. ప్రత్యేకించి క్రీస్తుని ప్రధాన యాజకత్వం గురించి 5, 7 అధ్యాయాలు ఏం చెప్తున్నాయో గ్రహించాలి. "ప్రధాన యాజకునిగా క్రీస్తు యొక్క గుణగణాలు మన మీద ఎలాంటి ప్రభావం చూపుతాయి?" అన్న విషయాన్ని మనం ప్రశ్నించుకోవాలి.

### క్రీస్తు మనయెడల కనికరం చూపగలవాడు

మొదటిగా, క్రీస్తు మన బలహీనతలలో మనయెడల కనికరం చూపగలవాడు అని మనం నేర్చుకున్నాము. (చదవండి 4:14-16.) ఎందుకు? ఎందుకంటే, ఆయన "సమస్త విషయములలోను మన వలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను." మానవునిగా ఉండడం అంటే ఏమిటో ఆయనకు తెలియును, కాబట్టి ఆయన మనయెడల కనికరం చూపగలవాడు (చూడు 2:17, 18).

క్రీస్తు యొక్క యాజకత్వం యొక్క ఈ లక్షణం మనలను ఏ విధంగా ప్రభావితం చేస్తుంది? మనకు అటువంటి ప్రధాన యాజకుడున్నాడు కాబట్టి మన విశ్వాసమును

అంటి పెట్టుకునియుండాలి (4:14). అంతేగాక, ధైర్యముతో కృపాసనమును మనం సమీపించాలి (4:16).

## ఒక యాజకునిగా క్రీస్తు దేవుని చేత నియమించబడ్డాడు

రెండవదిగా, లేవీ యాజకుల వలె క్రీస్తు దేవుని చేత నియమించబడ్డాడు అని మనం నేర్చుకున్నాము. (చదవండి 5:1–11.)

ఈ వాక్య భాగములో మోషే ధర్మశాస్త్రమునకు లోబడియున్న యాజకుల గురించి మనం నేర్చుకుంటాము. 5:1–4 ప్రకారం, వారు (1) ప్రజల పక్షాన పని చేశారు, (2) బలులను అర్పించారు, (3) వారు, బలహీనులే కాబట్టి ఏమియు "తెలియనివారియెడల, త్రోవ తప్పిన వారియెడల" తాలిమి చూపించారు, (4) తమ కొరకు బలులను అర్పించారు, మరియు (5) దేవుని చేత పిలువబడియున్నారు. మన ప్రధాన యాజకుడు, క్రీస్తు వారి వంటివాడే కాబట్టి ఆయన (1) ప్రజల పక్షాన పని చేస్తున్నాడు, (2) బలిని అర్పించాడు. (3) మన బలహీనతలయందు అనుభవం కలిగియున్నాడు కాబట్టి పాపులతో తాలిమిగా వ్యవహరిస్తున్నాడు, మరియు (4) దేవుని చేత నియమించబడ్డాడు. కానీ లేవీ యాజకులకు భిన్నముగా ఆయన తన సొంత పాపముల నిమిత్తం బలి అర్పించనవసరం లేదు ఎందుకంటే, ఆయన పాపరహితుడు (4:15).

అయితే, యేసు ప్రధనయాజకునిగా దేవుని చేత నియమింపబడినవాడు అన్నది 5:1–11లోని ప్రాథమిక విషయం. ఈ సత్యమును రుజువు పర్చడానికి 5 నుండి 7 వచనాలలో గ్రంథకర్త రెండు పాత నిబంధన వాక్య భాగములను ఉదహరిస్తున్నాడు (కీర్తన 2; 110). అంతేగాక, వాక్య ప్రకారం, యేసు – దేవుని కుమారుడు అయినాగాని – ఆయన శ్రమల ద్వారా నేర్చుకున్న విధేయత వలన తన యాజకత్వమునకు అర్హత సాధించాడు. మరణము వరకు విధేయుడగుటవలన ఆయన మన ప్రధాన యాజకుడయ్యాడు. ఈ విధంగా, "తనకు విధేయులైన వారికందరికీ ఆయన రక్షకుడయ్యాడు" (5:8, 9).

## మెల్కీసెదెకు క్రమము చొప్పున క్రీస్తు యాజకుడు

మూడవదిగా, మెల్కీసెదెకు క్రమములో ఆయన తరువాత క్రీస్తు ప్రధాన యాజకుడయ్యాడు (5:10) అని గ్రంథకర్త తన పాఠకులను ప్రోత్సహిస్తున్నాడు. మెల్కీసెదెకు గురించి పేర్కొన్న తరువాత, "సంపూర్ణులమగుటకు సాగిపోదము" (6:1). తరువాత 5వ అధ్యాయములో పరిచయం చేయబడిన మెల్కీసెదెకును గురించి 7వ అధ్యాయంలో చెప్తున్నాడు. (చదవండి 7:1–25.) ఈ అసాధారణ యాజకుని గురించి పరిశీలించుదాము.

### మెల్కీసెదెకు యాజకత్వము యొక్క గుణములు

మెల్కీసెదెకు యాజకత్వము గురించిన కొన్ని సత్యములను మనం హెబ్రీయులకు 7లో నేర్చుకుంటున్నాము. క్రీస్తునకు ఏర్పరచబడిన ఈ యాజకత్వము లేవీ యాజకత్వమునకు ఎలా భిన్నమైనది?

*శాశ్వత యాజకత్వము.* పాత నిబంధనలో మెల్కీసెదెకు గురించి మనకు తెలిసిన వచనములను ఉదహరిస్తూ హెబ్రీయులకు 7 ప్రారంభమవుతుంది (చూడు ఆదికాండము

14:17–20).

వాక్యములో మెల్కీసెదెకు ఆకస్మాత్తుగా కనబడతాడు మరియు అతని జనన మరణాలు, వంశ క్రమమును గురించిన వివరాలు ఏమీ ఇయ్యబడలేదు కాబట్టి “అతడు నిరంతరము యాజకునిగా ఉన్నాడు” (7:3) అని గ్రంథకర్త స్పష్టం చేస్తున్నాడు. అదేవిధంగా, లేవీ యాజకత్వమునకు విరుద్ధంగా, యేసు “నిరంతరము యాజకత్వము కలిగినవాడాయెను” (7:23, 24).

*శ్రేష్ఠమైన యాజకత్వము.* మోషే ధర్మశాస్త్రమునకు లోబడియున్న లేవీ యాజకత్వము కంటే, క్రీస్తు యొక్క యాజకత్వము శ్రేష్ఠమైనదని మెల్కీసెదెకు ఉదంతమును గ్రంథకర్త ఉదహరిస్తున్నాడు. అబ్రాహాము మెల్కీసెదెకునకు దశమ భాగములను ఇచ్చాడన్న విషయాన్ని ఇతడు పేర్కొంటున్నాడు (7:4). అబ్రాహాము సంతానమైన లేవీ యాజకులకు ఇశ్రాయేలీయులు దశమ భాగములను ఇచ్చారు. దశమ భాగములను స్వీకరించిన లేవీ యాజకులు మెల్కీసెదెకునకు దశమ భాగమును చెల్లించారు (అబ్రాహాము ద్వారా) కాబట్టి మెల్కీసెదెకు వారి కంటే గొప్పవాడు (7:4–10). కాబట్టి లేవీ యాజకత్వముకంటే క్రీస్తు యాజకత్వము శ్రేష్ఠమైనదని ఈ దృష్టాంతమును బట్టి స్పష్టం చేయవచ్చు.

*భిన్నమైన యాజకత్వము.* మెల్కీసెదకు క్రమములో మరియొక యాజకుడు రానున్నాడని దావీదు చెప్పిన ప్రవచనం ధర్మశాస్త్రములోని లోపమును సూచిస్తుందని 7:11లో గ్రంథకర్త తెలియజేస్తున్నాడు. ఒకవేళ ధర్మశాస్త్రం ఏ లోపము లేనిదయితే, మెల్కీసెదెకు క్రమములో మరియొక యాజకుడు రావలసిన అవసరత ఉండేది కాదు.

దాన్నిబట్టి, క్రీస్తు యాజకత్వము లేవీ యాజకత్వము కంటే భిన్నమైనది. క్రీస్తు వేరే గోత్రములో జన్మించాడు (7:13, 14); “మరియు శరీరానుసారముగా నెరవేర్చబడు ఆజ్ఞగల ధర్మశాస్త్రమునుబట్టి కాక, నాశనములేని జీవమునకున్న శక్తినిబట్టి నియమింపబడి” (7:16) ఆయన యాజకుడయ్యాడు. లేవీ యాజకుల వలెగాక, ఆయన ప్రమాణమునుబట్టి యాజకుడయ్యాడు (7:20, 21).

*ఏక యాజకత్వం.* అంతేగాక, యేసుని యాజకత్వం ఏకైకమైనది. పాత నిబంధనలోని యాజకులు “మరణము పొందుట చేత ఎల్లప్పుడును ఉండ సాధ్యము కానందున అనేకులైరి” (7:23), గానీ, క్రొత్త నిబంధనలో యేసు మాత్రమే ఏకైక ప్రధాన యాజకుడు.

## క్రీస్తు యొక్క మేలైన యాజకత్వము వలన పర్యవసానం

క్రీస్తు లేవీ క్రమము చొప్పున గాకుండా మెల్కీసెదెకు క్రమమున, క్రీస్తు ప్రధాన యాజకుడు కావడం మూలమున ఏ పర్యవసానం కలుగుతుంది? క్రీస్తుని శ్రేష్ఠమైన యాజకత్వం గురించిన రెండు ఫలితాలను హెబ్రీయులకు 7 చూపిస్తుంది.

శ్రేష్ఠమైన నిబంధన. క్రీస్తు మన ప్రధాన యాజకుడు, మరియు ఆయన యాజకత్వం లేవీ యాజకత్వం కంటెను శ్రేష్ఠమైనది. కాబట్టి మోషే ధర్మశాస్త్రం కొట్టివేయబడిందని గ్రంథకర్త హెబ్రీయులకు 7లో పలుమార్లు స్పష్టం చేస్తున్నాడు. (1) యాజకత్వము మార్చబడెను గనుక యాజక ధర్మము కూడ మార్చబడెను (7:12). (2) “ముందియ్యబడిన ఆజ్ఞ” ప్రక్కన పెట్టబడింది. ఎందుకంటే, “అది బలహీనమైనది, నిష్ప్రయోజనమైనది (ఎందుకంటే, ఆ ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణసిద్ధి కలుగజేయలేదు)” (7:18, 19). (3) యేసు “మరి

శ్రేష్ఠమైన నిబంధనకు పూట కాపాయెను" (7:22). క్రీస్తు యాజకత్వం అందించే మరి శ్రేష్ఠమైన నిబంధనను గురించి దేవునికి కృతజ్ఞతలు తెలియజేద్దాము!

*రక్షణ అందుబాటు.* నిత్యమైన క్రీస్తు యాజకత్వం గురించి హెబ్రీయులకు 7:25 యిలా చెప్తుంది: "ఈయన తనద్వారా దేవునియొద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడైయున్నాడు." యేసు మనకు రక్షణ అందించేందుకు నిరంతరము జీవించుచున్న ప్రధాన యాజకుడు కాబట్టి మనం క్రీస్తు నొద్దకు రాగలిగినందుకు మనం దేవున్ని స్తుతింపబద్ధులము!

## మన పాపములకు క్రీస్తు సంపూర్ణ బలిని అర్పించాడు

నాల్గవదిగా, మన ప్రధాన యాజకుడైన యేసు క్రీస్తు, మన పాపముల నిమిత్తం సంపూర్ణంగా అర్పించాడు అని మనం నేర్చుకున్నాము. (చదవండి 7:26–28.) ఈ వాక్య భాగంలో పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య గల వ్యత్యాసమును చూడగలం: (1) పాత నిబంధన యాజకులు బలహీనులు మరియు పాపులు (5:2; 7:28), కాగా, "క్రీస్తు పవిత్రుడును, నిర్దోషియు, నిష్కల్మషుడును, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడును. ఆకాశ మండలముకంటె మిక్కిలి హెచ్చయినవాడు" (7:26) మరియు ఈయన "సంపూర్ణ సిద్ధి పొందెను" (7:28). (2) లేవీ యాజకులు తమ నిమిత్తం బలి అర్పించియుండగా (5:3), క్రీస్తు తన పాపరాహిత్యమునుబట్టి బలి అర్పించనక్కరలేదు. (3) పాత నిబంధన క్రింద బలులు నిత్యము అర్పించుచుండగా, క్రీస్తు ఒకే బలిని – "శాశ్వత కాలమునకు సరిపోవునట్లు" అర్పించాడు. (4) లేవీ యాజకులు జంతువులను బలిగా అర్పింపగా, క్రీస్తు తనను తానే అర్పించుకున్నాడు (చూడు 9:11–14; 9:28).

క్రీస్తు యాజకత్వము గురించిన ఈ సత్యాలు మనకు ఏమి తెలుపుతున్నాయి? పాత నిబంధన ద్వారా మనకు అందివ్వబడని పాపక్షమాపణ క్రీస్తు బలి ద్వారా మనకు అందించ బడింది. మనమికమీదట పాపములోనుండవలసిన అగత్యత లేదు. ఎందుకంటే మన ప్రధాన యాజకుడయిన క్రీస్తు మన పాపములను శాశ్వతంగా తీసివేయుటకు తన్నుతానే బలిగా అర్పించుకున్నాడు!

## క్రీస్తు ఇంకనూ ప్రధాన యాజకునిగా ఉన్నాడు

ఐదవదిగా, ప్రధాన యాజకునిగా క్రీస్తు ఇంకనూ పనిచేయుచున్నాడని మనం నేర్చుకుంటున్నాము. (చదవండి 8:1, 2.) ఈ వచనాల్లో చెప్పబడుతున్న విషయమేమంటే, క్రీస్తు ప్రధాన యాజకునిగా ఇంకనూ ఉన్నాడన్న విషయమే! "అట్టి ప్రధానయాజకుడు మనకు (ఇప్పుడు) ఉన్నాడు. ఆయన ... పరలోకమందు మహామహుని సింహాసనమునకు కుడి పార్శ్వమున ఆసీనుడాయెను." మన నిమిత్తం ఆయన పని చేస్తున్నాడు. అనగా *ఆయన ద్వారా మనం ఇప్పుడు దేవుని సమీపించగలము;* ఎందుకంటే, "విజ్ఞాపనము చేయుటకు నిరంతరము ఆయన జీవించుచున్నాడు" అని 7:25 చెప్తుంది.

**ముగింపు**

ముగించబోయేముందు, *పరలోకం వెళ్లుటకు మనకు సహాయం* అవసరమని మనం గుర్తుంచుకుందాము. మనం బలహీనులము, పాపులము మనకు మనముగా దాన్ని అందుకోలేము. అయితే, శుభవార్త ఏంటంటే, మన ప్రధాన యాజకుడయిన క్రీస్తు యేసు ద్వారా మనకు తగిన సహాయం లభిస్తుంది. ఆయన మన మధ్యవర్తి, మన నిమిత్తం "విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్న" విజ్ఞాపన కర్త. కాబట్టి ఆయన చేసిన దాన్నిబట్టి మన దేవున్ని ధైర్యముగా సమీపించగలమని గుర్తించి ఆయన సహాయాన్ని పొందుకుందాము.

క్రీస్తు మీ ప్రధాన యాజకుడా? నిన్ను నీవుగా ఆయన్ను సమీపించక, నిన్ను నీవు నూతన నిబంధనలోనికి తీసుకురాకుండా ఉన్నట్లయితే, ఆయన నీ ప్రధాన యాజకుడు కాదు. అంతేకాదు నీవు పరలోకం వెళ్లుటకు తగిన సహాయాన్ని ఆయన అందించడు. ఆయన నీ ప్రధాన యాజకునిగా ఉండాలంటే, ఆయన చిత్తమును జరిగించుట ద్వారా నీవు విధేయతను చూపించాలి (హెబ్రీయులకు 5:8, 9). ఆయన ఆజ్ఞలకు లోబడియుండి (యోహాను 8:24), మారుమనస్సు పొంది (లూకా 13:3), విశ్వాసమును ఒప్పుకుని (మత్తయి 10:32), బాప్తిస్మం పొందండి (మార్కు 16:16; మత్తయి 28:19, 20). ఇలా చేసినప్పుడు, క్రీస్తుని సంపూర్ణ బలి ద్వారా నీవు రక్షింపబడగలవు, ఆయన నీ ప్రధాన యాజకుడవుతాడు, నీవు పరలోకం వెళ్లుటకు ఆయన సహాయం చేస్తాడు!

---

సూచన

[1]హెబ్రీయులకు 8:1లో చెప్పబడిన విషయం 5 నుండి 7 అధ్యాయములలో చెప్పబడిన విషయమును సూచిస్తుంది. క్రీస్తు యొక్క యాజకత్వము ఈ గ్రంథమంతటిలోను చెప్ప బడింది. ఉదాహరణకు చూడు హెబ్రీయులకు 1:3 (సూచన); 2:17; 3:1; 4:14, 15; 8:1–4; 9:11; 10:11, 12.